క్లుప్తంగా

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

గిద్దలూరు రూరల్: ప్రమాదవశాత్తు కూలీలు వెళ్తున్న ఆటో బోల్తా పడటంతో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని వెల్లుపల్లె గ్రామ సమీపంలో గురువారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. పాములపల్లె గ్రామం నుంచి ఆటోలో 20 మంది కూలీలు పొలం పనుల కోసం ఆటోలో వెళ్తున్న సమయంలో రోడ్డుకు అడ్డంగా కుక్క వచ్చింది. ఆటో రోడ్డు మార్జిన్ దాటి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. గాయాలపాలైన వారిని స్థానికులు చికిత్స కోసం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

లక్ష్యాలు సాధించకుంటే చర్యలు తప్పవు

ముండ్లమూరు: విధి నిర్వహణలో సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను సకాలంలో సాధించకుంటే చర్యలు తప్పవని వైఎస్సార్ కేపీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆదిశేషు అన్నారు. స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో గురువారం ఆయన వీఓఏలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల లావాదేవీలను ప్రతి నెలా 15 వ తేదీ లోపు విధిగా పూర్తి చేయాలన్నారు. వైఎస్సార్ చేయూత, హెచ్‌డీ సర్వేను నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలన్నారు. రుణాల వసూళ్లపై నిర్లక్ష్యం విడనాడి చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. మూడు నెలలు గడువు ఇస్తున్నామని, పని తీరు మెరుగు పరుచుకోకపోతే శాఖా పరమైన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. సమావేశంలో దర్శి క్లస్టర్ ఏరియా కో ఆర్డినేటర్ వసుంధరాదేవి, ఏపీఎం హనుమంతరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు దొనకొండ విద్యార్థులు

దొనకొండ: ఎస్‌జీఎఫ్ ప్రకాశం జిల్లా ప్రభుత్వ పాఠశాల చీమకుర్తిలో నిర్వహించిన ప్రకాశం జిల్లా బేస్ బాల్ సెలక్షన్‌లో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపటంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నరసింహారావు తెలిపారు. ఆదర్శ బీఈడీ కాలేజీ గిద్దలూరులో నిర్వహించిన పోటీల్లో సంజయ్ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరు రాష్ట్ర స్థాయిలో జరగబోయే పోటీల్లో ప్రకాశం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని నరసింహారావు పేర్కొన్నారు.

పుల్లయ్యకు అభినందనలు



గిద్దలూరు రూరల్: రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా తొండమల్ల పుల్లయ్యను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసినందుకు ఆయన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తొడమల్ల పుల్లయ్య స్వగ్రామం గిద్దలూరు మండలం నరవ గ్రామం కాగా అతడు తిరుపతిలో వ్యాపారరిత్యా స్థిరపడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆయన సేవలను గుర్తించిన టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి సహాయ సహకారాలతో ఆయనకు నాయీబ్రాహ్మణ చైర్మన్ పదవి దక్కిందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు గిద్దలూరు నాయీబ్రాహ్మణ సంఘ నాయకులు నారాయణతో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

జనప నార సంచుల విక్రయ కేంద్రం పరిశీలన

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట జనపనార సంచుల విక్రయ కేంద్రాన్ని గురువారం పీసీసీఎఫ్ అజయ్‌కుమార్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా జనపనార కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలు తయారు చేసిన జనపనార సంచులను ఆయన పరిశీలించారు. శిక్షణపై వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలగకుండా జనపనార సంచులను ప్రతి ఒక్కరూ ఉపయోగించేలా చూడాలన్నారు. జనపనార సంచులను వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్వాహకులకు అందజేశారు. డిప్యూటీ డైరెక్టర్ వై.నరసింహారావు, రేంజి ఆఫీసర్ జీవన్ కుమార్, డిప్యూటీ రేంజిర్ వంశీకృష్ణ, ఆలయ నిర్వాహకులు గంజి వీరయ్య పాల్గొన్నారు.

రైల్వేగేటు మూసివేతపై గ్రామసభ

అర్ధవీడు (కంభం) నాగులవరం-కంభం మధ్యలో ఉన్న రైల్వే గేటును సౌత్‌సెంట్రల్ రైల్వే అధికారులు మూసివేయాలని నిర్ణయం తీసుకుంటున్న నేపథ్యంలో శుక్రవారం కంభం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు అర్ధవీడు తహసీల్దార్ అత్తార్ నాయబ్ హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, ఈ మార్గంలో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు గ్రామ సభలో పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయాలని ఆయన కోరారు.

బత్తాయి మొక్కల ధ్వంసంపై విచారణ

కొనకనమిట్ల: కొనకనమిట్ల గ్రామానికి చెందిన యక్కంటి తిరుపతిరెడ్డికి చెందిన 3 ఎకరాల బత్తాయి తోటలో అర ఎకరాలోని బత్తాయి మొక్కలు, మిరప పంటను అదే గ్రామానికి చెందిన ధర్మరాజుల గురవయ్య, గురుస్వామి, కె.అజయ్ ధ్వంసం చేసినట్లు బాధితుడు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఎవరి భూమిలో బత్తాయి మొక్కలు ఉన్నాయో నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఎస్సై బ్రహ్మనాయుడు కోరడంతో గురువారం వీఆర్‌ఓ కుమార్, సర్వేయర్ శ్రీను భూమి కొలతలు వేశారు. మొక్కలు ధ్వంసం చేసిన భూమి బాధితుడు తిరుపతిరెడ్డి దేనని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

పేద ప్రజల కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష



కంభం: జంగంగుంట్లలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే అన్నా



కోలభీమునిపాడులో మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేపీ



దొనకొండ: పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ



ముండ్లమూరు: డీఎల్‌డీఓను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కంభం: పేద ప్రజల ఆరోగ్యం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. గురువారం మండలంలోని జంగంగుంట్లలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడంతో పాటు సమస్యలు ఉన్న వారికి సలహాలు ఇచ్చి ఇతర ప్రభుత్వ వైద్యశాలలకు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫారసు చేస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య సిబ్బందితో మాట్లాడి వైద్యశిబిరాలకు వస్తున్న ప్రజల ఆరోగ్య సమస్యలపై ఆరాతీశారు. అనంతరం ఆయన శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, ఎంపీడీఓ ప్రసాద్‌బాబు, సర్పంచ్ మాసా సుజాత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, చేగిరెడ్డి ఓబుల్ రెడ్డి, పాలగిరి శరభారెడ్డి, ఇఓపీఆర్డీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

దొనకొండ: మండలంలోని కొచ్చెర్లకోట సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్షా వైద్య సేవలు నిర్వహించారు. వైద్యాధికారి ఎం.సునీత పర్యవేక్షణలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, వైస్ ఎంపీపీ మిట్టా కోటిరెడ్డి, సర్పంచ్ కాటే వసంత వైద్య పరీక్షలు పరిశీలించారు. ఐసీడీఎస్ సిబ్బంది తయారు చేసిన పౌష్టికాహారాన్ని తనిఖీ చేసి రుచి చూశారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.డేవిడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో పేదల ఆరోగ్యానికి భరోసా ఏర్పడిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని రెంటపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ రవినాయక్ తెలిపారు. సర్పంచ్ నాయక్, తహసీల్దార్ దాసు, ఎంపీడీవో మరియదాసు, ఈవోఆర్డీ శరత్‌బాబు పాల్గొన్నారు.

తాళ్లూరు (ముండ్లమూరు): ప్రతి పేదవాడికి మెరుగైన వైద్య సేవలు అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తూము వెంకట సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని లక్కవరంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 422 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 79 మందికి కళ్ల పరీక్షలు చేసి వారిలో 38 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. సర్పంచ్ నన్నం వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు రావినూతల వెంకటమ్మ, వైద్యాధికారులు రత్నం, మౌనిక, రాజేష్ యాదవ్, లీనా, అరుణకుమారి పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికి ఆరోగ్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తుందని తహసీల్దార్ డి.సీతారామయ్య అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని బురుజుపల్లెలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే చేశారు. వైఎస్సార్ కంటి పథకం కింద లబ్ధిదారులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఎంపీపీ కడప లక్ష్మి, డాక్టర్లు మానస, దివ్య, వైస్ ఎంపీపీ నోబెల్, సీడీపీఓ జ్యోతి, ఈఓఆర్డీ చెన్నారావు పాల్గొన్నారు.

ముండ్లమూరు: అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందించనున్నట్లు వైస్ ఎంపీపీ బంకా రమణమ్మ నాగిరెడ్డి అన్నారు. మండలంలోని నాయుడుపాలెంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 343 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష పర్యవేక్షణాధికారి, డీఎల్‌డీఓ ఉషారాణి శిబిరాన్ని పర్యవేక్షించి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమెను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యుడు తాతపూడి రత్నరాజు, తహసీల్దార్ నయీం అహ్మద్, ఎంపీడీఓ హనుమంతరావు, ఈఓఆర్డీ శ్రీదేవి, ఎంఎల్‌ఓ నాగమల్లేశ్వరరెడ్డి, డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, ప్రియాంక, జ్యోతి, ఫిరోజ్ ఉన్నారు.

అర్ధవీడు (కంభం): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పెద్దకందుకూరులో వైద్యశిబిరం ఏర్పాటు చేసారు. జెడ్పీటీసీ సభ్యురాలు చెన్ను విజయ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెనుకబడ్డ అర్ధవీడు మండలంలో స్పెషలిస్టు వైద్యులతో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఒంగోలు, గుంటూరు లాంటి దూరప్రాంతాలకు వెళ్లలేని వారు వైద్యశిబిరంలో స్పెషలిస్టు వైద్యులను సంప్రదించి తమ సమస్యలు తెలుసుకునే వీలు కలిగిందన్నారు. ఎంపీడీఓ జగదీష్, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం

పొదిలి రూరల్: దేశంలో ఎక్కడా లేని విధంగా పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ ఏర్పాటు చేశారని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గురువారం పొదిలి నగర పంచాయతీ సచివాలయం-4లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. వైద్య శిబిరంలోని కౌంటర్లు, అంగన్‌వాడీ స్టాల్‌ను సందర్శించారు. అనంతరం రోగులకు మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ డానియల్ జోసఫ్, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాసులు, మండల, పట్టణ కన్వీనర్లు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, ఎస్‌కే నూర్జహాన్ బేగం, జేసీఎస్ కన్వీనర్ గొలమారి చెన్నారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ కె.నరసింహారావు, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ జూపల్లి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జమ్మనపల్లి, కోలభీమునిపాడు, కె.కొత్తపల్లి గ్రామాల వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ సాయికుమార్, మార్కాపురం ఎంపీడీఓ తోట చందన, సర్పంచ్ దండా వెంకటేశ్వరరెడ్డి, వైద్యులు రోహిత్ నాయక్, డి హరీష్‌రావు, ఎస్ డేవిడ్, బి.ప్రసన్నరాణి, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్లలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ బొజ్జా చెంచయ్య ప్రారంభించారు. ప్రభుత్వ వైద్యులు బాలయ్య, నరేంద్ర కుమార్, పృథ్వీరాజ్, సురేఖ, గైనకాలజిస్టులు డాక్టర్లు పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి పర్యవేక్షించారు. ఎంఈఓ నరసింహరావు, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు నుసుం బాలచంద్రుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తర్లుపాడు: మండలంలోని పోతలపాడులో వైద్య శిబిరాన్ని ఎంపీడీఓఓ ఎస్.నరసింహులు, సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ పుణ్యవతమ్మ, స్థానిక నాయకులు వెంకటేశ్వరరెడ్డితో కలిసి జెడ్పీటీసీ వెన్నా ఇందిర హనుమారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యులు రామసుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మురారి, కేతగుడిపి సర్పంచ్ పెద్ద మస్తాన్, తర్లుపాడు వైస్ సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.



పొదిలిలో వృద్ధులకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



పెదారికట్లలో మాట్లాడుతున్న ఎంపీడీఓ



గిద్దలూరు: మాట్లాడుతున్న తహసీల్దార్ సీతారామయ్య



తాళ్లూరు: లక్కవరంలో..



పుల్లలచెరువు: ఆరోగ్య కిట్ అందజేస్తున్న కన్వీనర్, అధికారులు



అర్ధవీడు: పెద్దకందుకూరులో..



కేతగుడిపిలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ వెన్నా ఇందిర

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఉడుముల

కొనకనమిట్ల: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం కోసం కష్టపడి పనిచేద్దామని ఆ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి పిలుపునిచ్చారు. చిన్నచిన్న విభేదాలు వీడి అందరం కలిసి కట్టుగా పనిచేద్దామని చెప్పారు. గురువారం గొట్లగట్టులో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పంచాయతీలో అభివృద్ధి పనులతోపాటు పలు సమస్యలపై చర్చించారు. గొట్లగట్టు ఎస్సీ కాలనీలో అంతర్గత రహదారుల అభివృద్ధికి, మంచినీటి సమస్యల పరిష్కానికి చర్యలు తీసుకుంటామని ఉడుముల హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అఖండ మెజార్టీతో గెలుపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో గొట్లగట్టు సచివాలయ పరిధిలోని నాయుడుపేట, గొట్లగట్టు, బుడంకాయలపాడు, వెలుగొండ్రాయునిపల్లి, తుంగనగర్ బీసీ కాలనీల్లో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, సొసైటీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి, ఎంపీటీసీ ఉడుముల రామనారాయణరెడ్డి, ఉప సర్పంచ్ గాడి కోటేశ్వరరెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకులు మాజీ ఎంపీటీసీ గోనుగుంట్ల శ్రీనివాసులు, కె.సుబ్బారావు(ఎంఆర్‌కె), మాజీ సర్పంచ్‌లు బత్తుల మాలకొండయ్య, దారకమళ్లి వెంకటేశ్వర్లు, సచివాలయ కన్వీనర్‌లు అనుకు ఏడుకొండలు, ఎన్ వెంకటేశ్వర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఈద్గా, శ్మశాన స్థలం పరిశీలన



తుమ్మలచెరువులో రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ సేథు మాధవన్

తర్లుపాడు: మండలంలోని బుద్ధపల్లి, తుమ్మలచెరువు గ్రామాల్లోని శ్మశానం, ఈద్గా స్థలాన్ని ఆక్రమించుకున్నారన్న ఫిర్యాదు నేపథ్యంలో గురువారం సబ్‌కలెక్టర్ సేథు మాధవన్ పరిశీలించారు. ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోకపోవడంతో సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తానని గ్రామస్తులకు సబ్‌కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్దుల్ హమీద్, వీఆర్‌ఓ కిశోర్, రంగయ్య, సర్వేయర్ రవి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

అర్ధవీడు (కంభం): విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు మండలంలో గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి అక్రమ విద్యుత్ వినియోగదారులకు జరిమానాలు విధించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హైమావతి, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 17 మంది అధికారులు, 45 మంది సిబ్బందితో 30 బృందాలుగా ఏర్పడి 1240 సర్వీసులు తనిఖీ చేశారు. అనుమతుల్లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 52 మందికి రూ.2.51 లక్షలు అపరాధ రుసుం విధించారు. తనిఖీల్లో డీఈఈలు బాల అంకయ్య, శేషగిరి, శ్రీనివాసులు, ఏఈలు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

మార్కాపురం: ఎస్‌జీఎఫ్ అండర్ 14 చెస్ పోటీల్లో మార్కాపురం బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎంవి స్నేహశ్రీ, నాగస్వాతి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు. వీరిని గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. అలాగే సాయిబాలాజీ హైస్కూల్ విద్యార్థిని బి.శ్రీవల్లి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ పి. ప్రకాష్‌రావు, ప్రిన్సిపాల్ మస్తాన్‌వలి తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

మార్కాపురం: రెవెన్యూ సేవలను ప్రజలకు సకాలంలో అందించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని మార్కాపురం నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన మంజునాథరెడ్డికి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. గురువారం ఎమ్మెల్యే కేపీని ఆయన నివాసంలో తహసీల్దార్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

తర్లుపాడు: శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రైల్వే క్రాసింగ్ గేట్‌పై ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అబ్దుల్ హమీద్ తెలిపారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు పాల్గొంటారని ప్రజలు తమ అభిప్రాయాలను వారి దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఉత్సాహంగా టెన్నిస్ పోటీలు

గిద్దలూరు రూరల్: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని క్లబ్ రోడ్డు టెన్నిస్ కోర్టు ప్రాంగణంలో గురువారం నిర్వహించిన టెన్నిస్ పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. క్రీడలను జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌రెడ్డి, గిద్దలూరు టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ రంగారెడ్డిలు ప్రారంభించారు. అండర్-14, అండర్-17 క్రీడాకారులకు నిర్వహించిన టెన్నిస్ క్రీడల్లో ప్రతిభ కనబరచిన వారిని స్కూల్ గేమ్స్ చీఫ్ ఆర్గనైజర్ గుర్రం శోభన్‌బాబుతో పాటు సభ్యులు కలిసి ఎంపిక చేశారు. విజేతలకు విశ్వభారతి స్కూల్ కరస్పాండెంట్ బండారు ఆదిలక్ష్మి జ్ఞాపికలు అందజేశారు. స్వర్ణ శ్రీనివాసరెడ్డి, టెన్నిస్ కోచ్ మురళి పాల్గొన్నారు.

40 మంది బాలికలకు సైకిళ్లు



బాలికలకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రమణారెడ్డి

పెద్దారవీడు: మండలంలోని సానికవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏకం అమెరికా, పీజీఎస్‌ఎఫ్ ఆర్థిక సాయంతో ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో 40 మంది బాలికలకు ఉచితంగా సైకిళ్లు సర్పంచ్ మూల వెంకట రమణారెడ్డి గురువారం పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ సంస్థ ఇచ్చిన సైకిళ్లను జాగ్రత్తగా ఉపయోగించుకొని ప్రతి రోజు పాఠశాలకు హాజరు కావాలని కోరారు. సంస్థ ఆర్గనైజర్ జేవీ మోహన్ రావు, ప్రధానోపాధ్యాయులు శ్రీరంగనాయకులు, స్కూల్ చైర్మన్ జి. వెంకటేశ్వర్లు, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు నవీన్, సర్వేశ్వరరెడ్డి, ఏరియా కోర్డినేటర్ జగీషా, అంబటి జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి రగ్బీ జట్ల ఎంపిక

అర్ధవీడు (కంభం): ప్రకాశం జిల్లా ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేడ్కర్ గురుకుల విద్యాలయం క్రీడామైదానంలో అండర్-14, అండర్-17 రగ్బీ బాల, బాలికల జట్ల ఎంపిక జరిగింది. జెడ్పీటీసీ చెన్ను విజయ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అండర్-14 బాయ్స్ విభాగంలో సీహెచ్ జాన్, బి.గోపిచంద్, టి.నాగచైతన్య, బి.జ్యోతిబాబు, శ్యామ్ హరీష్, విజయ్‌కుమార్, సుభాష్ పాల్, తనీష్‌రెడ్డి, సాంబశివ, ఓంకార్ మహేశ్వరరెడ్డి, రియాజ్, అనిల్, అండర్-17 బాయ్స్ విభాగంలో షఫిక్, తేజ, ఇబ్రాయేలు, అభి, వినయ్‌కుమార్, బ్రహ్మతేజ, ప్రసాద్, కాశీవెంకట నవీన్, ఆనంద్, అభిలాష్, వేణు, జాన్‌పాల్, అండర్-14 గరల్స్ విభాగంలో స్పందన, రాజ్యలక్ష్మి, వి.లీల, తులశీ హర్షిణి, దుర్గాపావణి, గురుకీర్తి, సాక్షి, సుగుణ, శివశరణ్య, నోరిన్, శ్రీలత, అను, అండర్-17 గరల్స్ విభాగంలో అన్నామేరి, శివమణి, తిరుమల, రక్షిత, పూజిత, హేమలత, తిరుపతమ్మ, ప్రవల్లిక, ప్రియాంక, షాహిద, శశిప్రియ, నాగజ్యోతి ఎంపికయ్యారు. పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎంఈఓ అబ్దుల్ సత్తార్, కేజీబీవీ ప్రిన్సిపాల్ మాలతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నియామక పత్రాలు



కార్యకర్తలు, ఆయాలకు నియామకపత్రాలు అందజేస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ యర్రగొండపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నియమితులైన కార్యకర్తలు, హెల్పర్లకు నియామక పత్రాలు అందజేసినట్లు సీడీపీవో పద్మావతి గురువారం తెలిపారు. నడిగడ్డ, బొల్లవాండ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, టి.చెర్లోపల్లి, హసనాపురం, సి.కొత్తపల్లి, ముటుకుల, యర్రగొండపాలెం బీసీ, అమానిగుడిపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు మంత్రి నియామక పత్రాలు అందజేశారని ఆమె తెలిపారు. పెద్దారవీడు మండలం కర్రోలలో బుధవారం రాత్రి జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ నియామక పత్రాలు మంత్రి అందజేశారని, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, పెద్దారవీడు ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య, జెడ్పీటీసీ యేర్వ చలమారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పి.కృష్ణారెడ్డి పాల్గొన్నారని ఆమె తెలిపారు.

మార్కెట్ యార్డ్‌తో రైతులకు మేలు చేయాలి

● ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: మార్కెట్ యార్డ్ ద్వారా సేవలందిస్తూ రైతులకు మేలు చేయాలని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నూతన కమిటీ ఎన్నిక తర్వాత మొదటి సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ డైరెక్టర్‌లు తమ పరిధిలోని గ్రామాలకు మార్కెట్ యార్డ్ ద్వారా అందాల్సిన సేవలు చైర్మన్ సహకారంతో అందించాలని సూచించారు. కురిచేడు వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ షకీలా అమీన్‌బాషా మాట్లాడుతూ అందరూ కలిసి కట్టుగా నియోజకవర్గంలో మార్కెట్ యార్డ్ ద్వారా రైతులకు మేలు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం డైరెక్టర్‌లకు వాల్ క్లాక్‌లు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహూకరించారు. మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కండె గంగయ్య, సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి చెన్నారెడ్డి, దర్శి, ముండ్లమూరు మండలాల సచివాలయం కన్వీనర్లు బత్తినేని వెంకటేశ్వర్లు, మేడికొండ జయంతి, ఏఎంసీ సూపర్‌వైజర్, పి.కపిల్, సెక్రటరీ మస్తాన్‌రావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు గాలిమూటి దేవప్రసాద్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కేసనపల్లి నాగేశ్వరరావు, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు షేక్ సైదా, రవి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ రోడ్లు



బస్టాండ్‌లో నిర్మించిన సీసీ రోడ్డు

యర్రగొండపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను అభివృద్ధి చేస్తున్నారు. రూ.13 లక్షలతో బస్టాండ్ ఆవరణలో సీసీ రోడ్డు, ప్లాట్‌ఫాంలు నిర్మిస్తున్నారు. వర్షాకాలం, ఎండా కాలంలలో ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు బస్టాండ్‌ను ఆధునికీకరిస్తున్నామని, త్వరలో మరిన్ని సదుపాయాలు కల్పిస్తామని ఆ శాఖ అధికారులు తెలిపారు. ప్రయాణికులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించకుండా స్థానిక పుల్లలచెరువు రోడ్డులో దాదాపు 3 దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన బస్టాండ్ నిరుపయోగంగా మారింది. ప్రజల అభ్యర్థన మేరకు ప్రయాణికులకు అందుబాటులో ఉండే విధంగా పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలో బస్టాండ్‌ను నిర్మించేందుకు 2022 జనవరి 23వ తేదీన అప్పటి విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు అక్కడ పంచాయతీ అధికారులు ప్రయాణికులకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించి ఆర్టీసీ సంస్థకు అప్పజెప్పారు. అప్పటి నుంచి అక్కడ వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా వర్షాకాలంలో బురద నిల్వ చేరకుండా, ఎండా కాలంలో దుమ్ము లేయకుండా, బస్సులు రాకపోకలకు ఇబ్బంది లేకుండా సీసీ రోడ్లు, ప్లాట్‌ఫాంలను నిర్మిస్తున్నారు. బస్టాండ్‌ను ఆధునికీకరణకు చర్యలు తీసుకున్న రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.